సాక్షి
నిజామాబాద్

శుక్రవారం । 23 । మే । 2025



భాగ్యరెడ్డి వర్మ జయంతి

దళిత మహిళలు, విద్యార్థుల అభ్యున్నతికి విశేషంగా కృషి చేసిన భాగ్యరెడ్డి వర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు.

- 8లో ▸



చదువుతోపాటు క్రీడల్లోనూ..

యువత చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
37.4 /22.3

ఆకాశం మేఘావృతమవుతుంది. పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి. వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఎస్సారెస్పీలోకి స్వల్ప ఇన్‌ఫ్లో

బాల్కొండ: ఎగువ ప్రాంతాల్లో రెండ్రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు శ్రీరాంసాగర్ జలాశయంలోకి 2,863 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 100, మిషన్ భగీరథకు 231, ఆవిరి రూపంలో 321 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా గురువారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1061.10 (11.6 టీఎంసీలు) అడుగుల నీరు నిలువ ఉందని ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నారు. ముమ్మందు వరద మరింత పెరిగే అవకాశం ఉందన్నారు.

సరస్వతి పుష్కరాలకు ప్రత్యేక బస్సులు

ఖలీల్‌వాడి: కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతి పుష్కరాల సందర్భంగా ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు నిజామాబాద్–1 డిపో మేనేజర్ ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23 నుంచి 26 వరకు ప్రతి రోజు ఉదయం 6 గంటలకు నిజామాబాద్ బస్టాండ్ నుంచి కాళేశ్వరం పుణ్యక్షేత్రానికి ఎక్స్‌ప్రెస్ బస్సు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. టికెట్ ధర పెద్దలకు రూ.560, పిల్లలకు రూ.290 ఉంటుందన్నారు. కాళేశ్వరం నుంచి ప్రతి రోజు సాయంత్రం 6 గంటలకు బస్సు బయల్దేరుతుందని పేర్కొన్నారు.

'దోస్త్' ప్రత్యేక కేటగిరి ధ్రువపత్రాల పరిశీలన



తెయూ(డిచ్‌పల్లి): దోస్త్ ఆన్‌లైన్ డిగ్రీ ప్రవేశాలకు రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రత్యేక కేటగిరి విద్యార్థుల ధ్రువపత్రాలను తెలంగాణ యూనివర్సిటీ వర్సిటీ అడ్మిషన్స్ కార్యాలయంలో గురువారం పరిశీలించారు. ఎన్‌సీసీ 14, స్పోర్ట్స్ 2, పీహెచ్‌సీ (దివ్యాంగులు) 1 అభ్యర్థులు పరిశీలనకు హాజరైనట్లు తెయూ దోస్త్ కోఆర్డినేటర్ డాక్టర్ వాసం చంద్రశేఖర్ తెలిపారు. ధ్రువపత్రాల పరిశీలనలో ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ రామస్వామి, తెయూ ఫిజికల్ డైరెక్టర్ బీఆర్‌నేత, టెక్నికల్ అసిస్టెంట్ నరేశ్, రవీందర్‌నాయక్ పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో ఒకరు డిబార్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న డిగ్రీ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ సెమిస్టర్ పరీక్షల్లో గురువారం మోర్తాడ్ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంలో మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతూ ఒక విద్యార్థి డిబార్ అయినట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. వర్సిటీ పరిధిలోని ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఏర్పాటు చేసిన 32 పరీక్ష కేంద్రాల్లో 13,366 మంది విద్యార్థులకు 12,303 మంది హాజరు కాగా 1,063 మంది గైర్హాజరైనట్లు వెల్లడించారు. ఉదయం జరిగిన 4వ సెమిస్టర్ రెగ్యులర్, 5వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలకు 6,395 మంది విద్యార్థులకు 5,898 మంది హాజరుకాగా 497 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2వ సెమిస్టర్ రెగ్యులర్, 3వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలకు 6,971 మంది విద్యార్థులకు 6,355 మంది హాజరు కాగా 616 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

విద్యార్థులను సురక్షితంగా ఇంటికి చేర్చాలి

- డీటీవో ఉమా మహేశ్వర్ రావు



పెర్కిట్ (ఆర్మూర్): విద్యార్థులను కుటుంబ సభ్యులుగా భావించి గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చాలని జిల్లా రవాణా శాఖ అధికారి ఉమా మహేశ్వర్ రావు సూచించారు. ఆర్మూర్ మండల ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాఠశాల, కళాశాలల బస్సు డ్రైవర్లకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీటీవో మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలన్నారు. ఆర్మూర్ ఎంవీఐ వివేకానంద రెడ్డి మాట్లాడుతూ స్కూల్ బస్సులకు తప్పనిసరిగా ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. వాహన తనిఖీల్లో మైనర్లు పట్టుబడితే యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు. సదస్సులో ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు భరత్‌చంద్ర మల్లయ్య, విద్య ప్రవీణ్, వేణు, మానస గణేశ్, కాంతి గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సర్కారుకు బాసట..
రైతుకు బోనస్

సన్నరకాలకు ప్రభుత్వ ప్రోత్సాహకం

- ధాన్యం సేకరణలో రాష్ట్రంలో నిజామాబాద్ జిల్లా ప్రథమం
- కొనుగోళ్లలో 88 శాతం సన్నరకాలే
- ప్రభుత్వానికి మద్దతుగా అన్నదాత

సుభాష్‌నగర్ : రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం సరఫరా చేస్తున్న సర్కారుకు జిల్లా రైతాంగం బాసటగా నిలిచింది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యంలో 88 శాతం సన్నరకాలుండటమే అందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. మిగతా జిల్లాల రైతులు దొడ్డు రకాలు సాగు చేయగా, నిజామాబాద్ జిల్లాలో మాత్రం సన్నరకాల వైపు మొగ్గు చూపారు. కాగా, సన్నరకాలు సాగు చేసిన రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహకంగా రూ.500 బోనస్ అందించనుంది. రాష్ట్రంలో ఇప్పటి వరకు 18.47 లక్షల మెట్రిక్ టన్నుల సన్నరకాలు సేకరించగా, అందులో మన జిల్లాలో 7.25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. జిల్లాలో 603 కొనుగోలు కేంద్రాల ద్వారా 1,01,561 మంది రైతుల నుంచి 8.16 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించగా, అందులో 7,25,499 మెట్రిక్ టన్నుల సన్నరకాలు, 91,488 మెట్రిక్ టన్నుల దొడ్డురకాలున్నాయి. ఇప్పటి వరకు 94,757 మంది రైతుల ఖాతాల్లో రూ.1,713 కోట్ల ధాన్యం డబ్బులు జమయ్యాయి.

సింహభాగం మన జిల్లాదే..

రాష్ట్రంలో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన సన్నరకాల్లో సింహభాగం నిజామాబాద్ జిల్లాదే. మొత్తం 18.47 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించగా, మన జిల్లాలోనే 7,25,499 మెట్రిక్ టన్నులు సేకరించారు. తర్వాతి స్థానంలో కామారెడ్డి, నల్గొండ, సూర్యాపేట, ఇతర జిల్లాలు ఉన్నాయి. యాసంగి సీజన్‌లో మన జిల్లా 8.16 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి, సన్నరకాల సేకరణలోనూ రాష్ట్రంలోనే మొదటిస్థానంలో నిలవడం విశేషం.

3.80 లక్షల ఎకరాల్లో సన్నరకాలు..

ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా ప్రజలకు సన్నబియ్యం సరఫరా చేస్తోంది. సన్నబియ్యం సరఫరా చేయాలంటే సన్నరకాలు పండించాలని రైతులు గ్రహించి ప్రభుత్వానికి బాసటగా నిలిచారు. క్వింటాలుకు రూ.500 బోనస్ కలిసి వస్తోందని భావించిన రైతాంగం యాసంగి సీజన్‌లోనూ అత్యధికంగా సన్నరకాలు సాగు చేసింది. సాధారణంగా యాసంగిలో స్వల్పకాలిక రకాలైన దొడ్డు రకాలను సాగు చేస్తారు. కానీ అందుకు భిన్నంగా ఈ సీజన్‌లో రైతులు 3.80 లక్షల ఎకరాల్లో సన్నరకాలను సాగుచేశారు. ఇదిలా ఉండగా ప్రభుత్వం ప్రకటించిన రూ.500 బోనస్ కోసం రైతులు ఎదురుచూస్తుండడం గమనార్హం.

సన్నరకాలు సాగు చేశా..



నాకు పదెకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇది వరకు దొడ్డు రకాలే సాగు చేసేవాడిని. ప్రభుత్వం రూ.500 బోనస్ ప్రకటించడంతో ఈసారి పదెకరాల్లో సన్నరకాలే సాగు చేశాను. దిగుబడి బాగా వచ్చింది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాను. ప్రభుత్వ ప్రోత్సాహం రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. – కైలాస్ మోహన్, మాజీ సర్పంచ్, తిర్మన్‌పల్లి

సన్నరకాలే అధికంగా సేకరించాం..



యాసంగి సీజన్‌లో సన్న రకాలే సేకరించాం. 7,25,499 మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం కొనుగోలు చేసి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచాం. మొత్తం సేకరించిన ధాన్యంలో కూడా జిల్లా టాప్‌లో నిలవడం గర్వకారణంగా ఉంది.
– శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా మేనేజర్, పౌరసరఫరాల సంస్థ

బియ్యం నిల్వలను వేగంగా తరలించాలి



గిడ్డంగిని పరిశీలించిన అనంతరం వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

- ధాన్యం బస్తాలు తడవకుండా చూడాలి
- అధికారులకు కలెక్టర్ ఆదేశం
- గిడ్డంగులను సందర్శించిన రాజీవ్‌గాంధీ హనుమంతు

నిజామాబాద్ రూరల్ : జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మిల్లుల వద్ద ఉన్న బియ్యం, కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం బస్తాలు తడిసిపోకుండా యుద్ధప్రాతిపదికన గోడౌన్లకు తరలించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులో ఉన్న మార్కెట్ కమిటీ గిడ్డంగులతోపాటు గుండారం శివారులోని స్టేట్ వేర్ హౌస్ కార్పొరేషన్‌కు చెందిన గిడ్డంగులను గురువారం కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా గోడౌన్లలో బియ్యం నిల్వలు, ధాన్యం బస్తాలను భద్రపరుస్తున్న తీరును గమనించారు. ఎన్ని రైస్‌మిల్లుల నుంచి ఎంత పరిమాణంలో మిల్లింగ్ జరిగిన బియ్యం నిల్వలు గోడౌన్లకు చేరాయి, ఇంకా ఎన్ని రావాల్సి ఉంది, వాటి నాణ్యత పరిశీలన, లాటింగ్ ప్రక్రియల నిర్వహణ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. గోడౌన్లలో లీకేజీలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. లోడింగ్, అన్‌లోడింగ్ ప్రక్రియలో జాప్యానికి తావులేకుండా సరిపడా సంఖ్యలో హమాలీలను అందుబాటులో ఉంచాలని, లారీల కొరత లేకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని అన్నారు. బియ్యం, ధాన్యం బస్తాల తరలింపు సమయంలో వర్షాలతో తడిసిపోకుండా టార్పాలిన్లు తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. కాగా, గిడ్డంగుల వద్ద బియ్యం నిల్వలను అన్‌లోడింగ్ చేయించడంలో కాంట్రాక్టర్ అలసత్వ వైఖరిని గమనించిన కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరు కాంట్రాక్టర్‌పై నిబంధనలకు అనుగుణంగా చర్యలకు సిఫార్సు చేయాలని పౌర సరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఎస్‌వో అరవింద్ రెడ్డి, సివిల్ సప్లైస్ డీఎం శ్రీకాంత్ రెడ్డి, నిజామాబాద్ మార్కెట్ కమిటీ సెక్రెటరీ అపర్ణ, గోడౌన్ మేనేజర్ చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

ధాన్యం సేకరణ వేగవంతంగా పూర్తిచేయాలి

- టెలీకాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు

నిజామాబాద్ అర్బన్: అకాల వర్షాలు కురుస్తున్న దృష్ట్యా ధాన్యం సేకరణ మరింత వేగవంతం చేసి త్వరితగతిన పూర్తిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఆదేశించారు. హైదరాబాద్ నుంచి గురువారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అధికారులతో అకాల వర్షాలు, ధాన్యం కొనుగోలు, ఖరీఫ్ సీజన్‌కు సన్నద్ధం తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ మరో రెండు, మూడు రోజులపాటు అకాల వర్షాలు భారీగా కురిసే అవకాశం ఉన్నందున జనజీవనానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతాలు, వాగుల వైపు ఎవరూ వెళ్లకుండా భద్రతా చర్యలు చేపట్టాలని, ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని హితవు పలికారు. వర్షాలతో తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందిలేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన విత్తనాలు, ఎరువులు, ప్రధానంగా యూరియా కొరత లేకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేసి నకిలీ, నిషేధిత విత్తనాలు, క్రిమిసంహారక మందులు విక్రయించకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. టాస్క్‌ఫోర్స్ కమిటీ ఆధ్వర్యంలో నకిలీ విత్తనాల అక్రమ రవాణా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. టెలీకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సాయాగౌడ్, పౌర సరఫరాల శాఖ అధికారులు అరవింద్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, మార్కెటింగ్ శాఖ అధికారిణి గంగవ్వ, డీసీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలకు చెక్

- కట్టడికి జిల్లాస్థాయి టాస్క్‌ఫోర్స్ బృందం ఏర్పాటు
- నిరంతరం తనిఖీలు చేపట్టనున్న అధికారులు



డొంకేశ్వర్ (ఆర్మూర్): ఖరీఫ్ సీజన్‌కు రైతులు సన్నద్ధమవుతున్న నేపథ్యంలో నకిలీ విత్తనాలను అరికట్టే దిశగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా స్థాయిలో సీడ్స్ టాస్క్‌ఫోర్స్ బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ మేరకు నలుగురు ఉన్నతాధికారులను నియమిస్తూ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. బృందంలో బోధన్ ఏడీఏ ఎంఏ అలీ అహ్మద్, పోలీసు శాఖ నుంచి ఏడీసీపీలు రాంచందర్ రావు, బస్వారెడ్డి, సీడ్స్ సర్టిఫికేషన్ అధికారి నగేశ్ ఉన్నారు. వీరు మండల స్థాయి అధికారులను సమన్వయం చేసుకొని విత్తన డీలర్లు, పంపిణీదార్లు, గోదాములు, దుకాణాలను తనిఖీ చేస్తారు. ఖరీఫ్‌కు అవసరమైన వరి, సోయా, మక్క, పత్తి విత్తనాలపై దృష్టి పెట్టనున్నారు. వ్యాపారులు ఇప్పటికే విత్తనాలను జిల్లాకు తెప్పించి విక్రయానికి సిద్ధంగా ఉంచారు. ప్రభుత్వం గుర్తించిన విత్తనాలు కాకుండా నాణ్యత లేని విత్తనాలు అమ్ముతున్నట్లు తనిఖీల్లో తేలితే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోనున్నారు. ఖరీఫ్ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 5,21,303 ఎకరాల్లో పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేయగా, ఇందులో అత్యధికంగా 4.32 లక్షల ఎకరాల్లో వరి, 47 వేల ఎకరాల్లో మొక్కజొన్న, 37 వేల ఎకరాల్లో సోయా సాగయ్యే అవకాశం ఉన్నట్లు ప్రణాళిక రూపొందించింది. ప్రస్తుతం వేసవి దుక్కులు పూర్తి చేసుకున్న రైతులు వర్షాల రాకతో పంటల సాగుకు సిద్ధమవుతున్నారు.

లైసెన్సు ఉన్న డీలర్ల వద్దే కొనాలి

నకిలీ విత్తనాలు అరికట్టి రైతులు మేలైన విత్తనాలు పొందేలా జిల్లా స్థాయిలో టాస్క్‌ఫోర్స్ టీం ఏర్పాటైంది. రైతులు విత్తనాలు కొనే ముందు లైసెన్సు కలిగిన అధీకృత డీలర్లు అవునో కాదో చూడాలి. లూజు విత్తనాలు అసలే కొనకుండా ప్రభుత్వం గుర్తించి ఆమోదం తెలిపిన విత్తనాలను కొనుగోలు చేయాలి. రసీదు తప్పనిసరిగా పొందాలి. కొనుగోలు చేసిన ప్యాకెట్లు, బస్తాలను రైతులు భద్రంగా దాచి పెటుకోవాలి.
– వీరాస్వామి, జిల్లా వ్యవసాయాధికారి

తడిసిన ధాన్యానికి తరుగు తీయొద్దు

- ఆర్మూర్‌లో నిజాంసాగర్ కెనాల్ కట్టపై రైతుల బైఠాయింపు
- ఆర్డీవో హామీతో ఆందోళన విరమణ



ఆర్మూర్ పట్టణంలోని నిజాంసాగర్ కెనాల్‌పై రాస్తారోకో చేస్తున్న రైతులు



మొలకెత్తిన ధాన్యాన్ని చూపుతున్న రైతులు

ఆర్మూర్‌టౌన్ : వర్షానికి తడిసిన ధాన్యాన్ని తరుగు తీయకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆర్మూర్ పట్టణంలోని నిజాంసాగర్ కెనాల్ కట్టపై గురువారం రైతులు బైఠాయించారు. మొలకలు వచ్చిన వడ్లను చూపుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ధాన్యం బస్తాలను వెనువెంటనే తరలించకపోవడంతో అకాల వర్షానికి తడిసిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. రెండు రోజులుగా వర్షం కురుస్తున్నా త్వరితగతిన కొనుగోళ్లు చేపట్టడం లేదని, దీంతో విక్రయానికి తీసుకొచ్చిన పంట నీటిపాలవుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 20 రోజులు గడిచినా కొంతమంది రైతుల ధాన్యం ఇప్పటికీ కాంట కాలేదని వాపోయారు. విషయం తెలుసుకున్న ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి రాస్తారోకో ప్రాంతానికి చేరుకొని ఆర్డీవోతో ఫోన్‌లో మాట్లాడించారు. రెండు రోజుల్లో మొత్తం ధాన్యం కొనుగోలు చేసి రైస్‌మిల్లులకు తరలిస్తామని ఆర్డీవో హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

10 కిలోల వరకు తరుగు తీస్తరట




తడిసిన ధాన్యాన్ని తరుగు లేకుండా కొనుగోలు చేయాలి. 5 నుంచి 10 కిలోల వరకు తరుగు తీస్తామని రైస్‌మిల్లులో చెబుతున్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది.
– రంజిత్, రైతు

ప్రభుత్వం ఆదుకోవాలి



తడిసిన ధాన్యాన్ని ఎలాంటి ఆంక్షలు లేకుండా ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలి. ఇప్పటికే వడ్లకు మొలకలు వస్తున్నాయి. అకాల వర్షంతో ఏం చేయాలో తోచడం లేదు. రైతులు నష్టపోకుండా ప్రభుత్వం ఆదుకోవాలి. – నరేందర్, రైతు

కమ్ముకొని.. కుమ్మరించి



నగర శివారు ముబారక్‌నగర్ ప్రాంతంలో కమ్ముకున్న మేఘాలు



వాన నీరు ముంచెత్తడంతో సావెల్ కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం బస్తాలను ట్రాక్టర్‌లోకి ఎక్కిస్తున్న రైతులు

నిజామాబాద్ అర్బన్: జిల్లా వ్యాప్తంగా రెండో రోజు గురువారం 33 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. మెండోరా మండలంలో 83 మి.మీ, బాల్కొండలో 78 మి.మీ, ముప్కాల్‌లో 64 మి.మీ, ఏర్గట్లలో 64 మి.మీ, వర్నిలో 62 మి.మీ, ఆర్మూర్‌లో 45 మి.మీ, రుద్రూర్‌లో 48 మి.మీ, బోధన్‌లో 38 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. పలుచోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొన్ని ప్రాంతాలలో రోడ్లపై ఉన్న ధాన్యం తడిసి ముద్దయింది.

రూ.400 కోట్లు దాటిన బంగారు రుణాలు



కేక్ కట్ చేస్తున్న చైర్మన్ కుంట రమేశ్ రెడ్డి, సీఈవో నాగభూషణం వందే

- ఎన్‌డీసీసీబీ చైర్మన్ రమేశ్ రెడ్డి

సుభాష్‌నగర్: ఉమ్మడి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) మంజూరు చేసిన బంగారు రుణాలు రూ.400 కోట్ల మైలురాయి చేరుకున్నాయి. ఈ సందర్భంగా నగరంలోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో గురువారం చైర్మన్ కుంట రమేశ్ రెడ్డి కేక్ కట్ చేసి హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బంగారు రుణాలు రూ.400 కోట్ల మైలురాయి చేరడంలో ప్రతి ఉద్యోగి పాత్ర ఉందన్నారు. బ్యాంకు ప్రగతిని ఇదే విధంగా కొనసాగించి, రాష్ట్రంలోనే అన్ని జిల్లాల కంటే మెరుగైన స్థితికి తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీఈవో నాగభూషణం వందే, జీఎం లింబాద్రి, గజానంద్, సుమమాల, ప్రధాన కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

కనువిందు చేసిన ఆరుద్ర పురుగు



డిచ్‌పల్లి: ఆరుద్ర కార్తె సమయంలో విరివిగా కనిపించే ఆరుద్ర పురుగు ఈసారి కాస్త ముందుగానే కనిపించింది. ప్రతి ఏటా వానాకాలం ప్రారంభమైన తర్వాత ఆరుద్ర కార్తె సమయంలో మాత్రమే ఈ ఎర్రటి దూది లాంటి పురుగులు కన్పిస్తుంటాయి. అయితే ఈసారి మే నెలలోనే వర్షాలు కురుస్తుండటంతో డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్, దూస్‌గాం గ్రామాల శివార్లలో ఆరుద్ర పురుగులు నేలలోంచి బయటకు వచ్చి తిరుగాడుతూ చూపరులకు కనువిందు చేస్తున్నాయి.

జూన్ 4లోగా పరీక్ష ఫీజు చెల్లించండి

నిజామాబాద్ అర్బన్: అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలోని ఎంబీఏ, ఎంఏ జర్నలిజం సెమిస్టర్ పరీక్షలకు సంబంధించి ఫీజులను జూన్ 4లోపు చెల్లించాలని సెంటర్ నిర్వాహకురాలు రంజిత ఒక ప్రకటనలో తెలిపారు. రూ.500 అపరాధ రుసుముతో జూన్ 11లోపు చెల్లించవచ్చన్నారు. జూన్ 26 నుంచి జర్నలిజం సెమిస్టర్ వన్ పరీక్షలు, జూలై 2నుంచి ఎంఏ జర్నలిజం మూడో సెమిస్టర్ పరీక్షలు జరుగుతాయన్నారు. జూన్ 26 నుంచి ఎంబీఏ ఒకటో సెమిస్టర్ పరీక్షలు, జూలై 2నుంచి ఎంబీఏ మూడో సెమిస్టర్ పరీక్షలు జరుగుతాయన్నారు. మిగతా వివరాలకు 73829 29612ను సంప్రదించాలన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నిజామాబాద్ అర్బన్: నగరంలోని టీఎన్జీవోస్ భవన్‌లో గురువారం జిల్లా సంక్షేమ శాఖలోని వసతిగృహ అధికారుల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా సురేష్, ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్ ఎన్నికయ్యారు. వీరిని టీఎన్జీవోస్ నాయకులు సన్మానించారు. టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు సుమన్, నాయకులు శ్రీనివాస్, మచ్చేందర్, దినేష్, గంగ కిషన్ ప్రకాష్, పద్మ పాల్గొన్నారు.

మహిళ శిశు సంక్షేమ సంఘం..

నిజామాబాద్‌నాగారం: నగరంలోని కలెక్టరేట్ లోగల టీఎన్జీవోస్ హాల్‌లో గురువారం మహిళ, శిశుసంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా నూతన అధ్యక్షురాలిగా గాలి విజయలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా శ్రీప్రియ, 16మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టీఎన్జీవోస్ అధ్యక్షుడు సుమన్, కార్యదర్శి శేఖర్, నాయకులు వనం సుధాకర్, ఇందిరా, స్వర్ణలత, మహేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

నిజామాబాద్ అర్బన్: జిల్లా వ్యాప్తంగా గురువారం ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు లాంగ్వేజెస్ పరీక్షలు నిర్వహించగా, 1431 మంది విద్యార్థులకు గాను 1331 మంది పరీక్షలకు హాజరైనట్లు జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి రవికుమార్ తెలిపారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి



మాట్లాడుతున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, పాల్గొన్న ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్, డీసీసీబీ చైర్మన్ రమేశ్‌రెడ్డి, నుడా చైర్మన్ కేశవేణు తదితరులు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి
- నగరంలో ముగిసిన తెలంగాణ ఉమెన్స్ ఫుట్‌బాల్ లీగ్ టోర్నమెంట్

నిజామాబాద్‌నాగారం: యువత చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తేనే మంచి భవిష్యత్ ఉంటుందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. గత వారం రోజులుగా నగరంలోని ఉమెన్స్ కళాశాల మైదానంలో కొనసాగిన ఉమెన్స్ ఫుట్‌బాల్ లీగ్ టోర్నమెంట్ గురువారం ముగిసింది. ఈసందర్భంగా నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఓ క్రీడాకారుడిగా క్రీడలకు రూ.3500 కోట్లు నిధులను విడుదల చేశారన్నారు. జిల్లాలో



ఇండియన్ లీగ్‌కు క్వాలిఫై అయిన కేర్ ఫుట్‌బాల్ అకాడమీ జట్టు

స్టేడియం ఏర్పాటుతోపాటు కోచ్‌లను నియమించే విధంగా ప్రభుత్వానికి నివేదిస్తానన్నారు. టోర్నమెంట్ దిగ్విజయం కావడానికి కారకులైన రాజేందర్‌రెడ్డి, కవితరెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి సుధీర్, కోచ్ నాగరాజులను అభినందించారు. ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందన్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధి పట్ల సుముఖంగా ఉందన్నారు. టోర్నమెంట్ చైర్మన్ రాజేందర్‌రెడ్డిడ్డి, కన్వీనర్ కవితరెడ్డి మాట్లాడుతూ.. మహిళల ఫుట్‌బాల్ లీగ్‌లో మొత్తం ఆరు జట్లు పాల్గొనగా సీఎఫ్ఏ టీం ఇండియా ఉమెన్స్ లీగ్2 కు క్వాలిఫై అయ్యారని తెలిపారు. అనంతరం విజేతలకు ట్రోఫీలు, బహుమతులు అందజేశారు. అంతకుముందు ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకోని, కాసేపు ఫుట్‌బాల్ ఆడారు. నుడా చైర్మన్ కేశవేణు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ భక్తవత్సలం, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నగేష్ రెడ్డి, రమేష్, ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య, ఫుట్బాల్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఫారుక్, జావిద్, సీనియర్ న్యాయవాది నీరజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భాగ్యరెడ్డి వర్మ జయంతి





కలెక్టరేట్‌లో నివాళులు అర్పిస్తున్న అధికారులు.. నగరంలోని సీపీ కార్యాలయంలో..

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని కలెక్టరేట్‌లో గురువారం దళిత మహిళలు, విద్యార్థుల అభ్యున్నతికి విశేషంగా కృషి చేసిన ఎం.భాగ్యరెడ్డి వర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి అదనపు కలెక్టర్ అంకిత్ పూలమాల వేసి నివాళులులు అర్పించారు. వక్తలు మాట్లాడుతూ.. భాగ్యరెడ్డి వర్మ జయంతిని అధికారికంగా నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. మహనీయులను గౌరవించుకోవడంతోపాటు వారి స్ఫూర్తితో సమాజ హితం కోసం ముందుకు సాగేందుకు ఈ వేడుకలు దోహదపడతాయని అన్నారు. భాగ్యరెడ్డి వర్మ అడుగుజాడల్లో నడుస్తూ, ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా సాంఘిక సంక్షేమ అభివృద్ధి శాఖ అధికారిణి నిర్మల, వివిధ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో..

ఖలీల్‌వాడి: నగరంలోని పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో గురువారం భాగ్యరెడ్డి వర్మ జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి అదనపు డీసీపీ బస్వారెడ్డి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ భాగ్యరెడ్డి వర్మ ఆశయాల సాధనకు కృషి చేయాలని, వారికి అన్ని రకాల సహకారాలు అందించుటకు పోలీస్ శాఖ నిరంతరం చిత్తశుద్ధితో ఉంటుందని అన్నారు.

తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనాలి

సుభాష్‌నగర్: జిల్లాలో రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిందని, వెంటనే ఆ ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులాచారి కోరారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుకు గురువారం ఆయన లేఖ ద్వారా విన్నవించారు. అకాల వర్షాల కారణంగా రైతులు కల్లాల వద్ద ఆరబెట్టిన ధాన్యం రాశులు తడిసిపోయాయని, తూకానికి సిద్ధంగా ఉన్న ధాన్యం కూడా తడిసిపోవడంతో తీవ్ర న ష్టం వాటిల్లిందన్నారు. కొన్ని ప్రాంతాల్లో అధిక వర్షాల కారణంగా కల్లాల్లో ఉన్న ధాన్యం వరద నీటిలో కొట్టుకుపోయిందని, తూకం వేసిన ధాన్యం బస్తాలు కూడా తడిసిపోయాయని తెలిపారు. ధాన్యం తడిసి ముద్దవుతున్నా. అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని, తడిసిన ధాన్యాన్ని ఇంతవరకూ అధికారులు పరిశీలించలేదని మండిపడ్డారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, వర్షంతో నష్టం జరిగిన రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

తూనికలు, కొలతల మోసాలపై చైతన్యవంతం కావాలి



నగరంలోని మార్కెట్‌కమిటీ కార్యాలయంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు, నాయకులు

సుభాష్‌నగర్: వినియోగదారులు, రైతులు తూనికలు, కొలతల మోసాలపై చైతన్యవంతం కావాలని, లీగల్ మెట్రాలజీ చట్టం–2011పై అవగాహన పెంచుకోవాలని సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ అపర్ణ సూచించారు. అంతర్జాతీయ లీగల్ మెట్రాలజీ వారోత్సవాల సందర్భంగా ఇందూరు వినియోగదారుల సంక్షేమ సమితి, భారత వినియోగదారుల సమాఖ్య ఆధ్వర్యంలో ముద్రించిన గోడప్రతులను గురువారం మార్కెట్ కార్యాలయంలో ఆమె ఆవిష్కరించారు. ఈసందర్భంగా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి సందు ప్రవీణ్ ఆధ్వర్యంలో తూనికలు, కొలతల్లో మోసాలపై చైతన్య కార్యక్రమాలు నిర్వహించారు. వినియోగదారుల నిత్య జీవితం తూనికలు, కొలతలతో ముడిపడి ఉంటుందని అపర్ణ తెలిపారు. వినియోగదారులు చట్టాలపై అవగాహన పెంపొందించుకున్నప్పుడే తన హక్కులను పొందుతాడన్నారు. సీసీఐ రాష్ట్ర కార్యదర్శి సందు ప్రవీణ్ మాట్లాడుతూ.. వ్యవసాయ మార్కెట్లలో ఎలక్ట్రానిక్ తూకాలు సక్రమంగా పని చేసేవిధంగా చూడాలని కోరారు. గ్రేడ్–2 సెక్రెటరీ శ్రీధర్, గ్రేడ్–3 సెక్రెటరీ మధుసూదన్, దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమితి ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌చారి, వీవెన్ వర్మ, శ్రీనివాస్, గైని రత్నాకర్, యాటకర్ల దేవేష్ పాల్గొన్నారు.

దంచికొట్టిన వాన



నగరంలో కురుస్తున్న వర్షం

నిజామాబాద్ నగరంలో గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షం కురిసింది. వివిధ పనుల నిమిత్తం బయటకు వచ్చిన ప్రజలు వర్షం కారణంగా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలువురు వర్షానికి తడవకుండా గొడుగులు పట్టుకొని ప్రయాణాలు సాగించారు.

సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్







గొడుగు పట్టుకొని వానలో ప్రయాణిస్తున్న జనం

నాణ్యమైన విద్యుత్ అందిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ

ఇందల్వాయి: విద్యుత్ సమస్యలను పరిష్కరించి, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందిస్తామని చైర్మన్ సీజీఆర్ఎఫ్–2, టీజీఎన్పీడీసీఎల్ ఎరుకల నారాయణ అన్నారు. ఇందల్వాయి మిషన్ భగీరథ పంప్‌హౌజ్‌లో గురువారం తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. కార్యక్రమానికి నారాయణతోపాటు, టెక్నికల్ మెంబర్ సలంద రామకృష్ణ, ఫైనాన్స్ మెంబర్ లకావత్ కిషన్, సీజీఆర్ఎఫ్ మరిపల్లి రాజాగౌడ్‌లు హాజరై వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రజలకు, రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు టీజీఎన్పీడీసీఎల్ కృషి చేస్తుందని అన్నారు. బిల్లులలో అవకతవకలు, లూస్ లైనింగ్, ఓవర్ లోడ్, కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటులో జాప్యం వంటి సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించినట్లు తెలిపారు. తొమ్మిది ఫిర్యాదులు వచ్చాయని వాటిని వేగంగా పరిష్కరించాలని సిబ్బందికి సూచించినట్లు తెలిపారు. సమస్యలను ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసినా పరిష్కరిస్తామని, అలసత్వం ప్రదర్శించిన సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు.

హెచ్‌టీ సర్వీస్‌ల మంజూరుకు ‘సింగిల్ విండో వ్యవస్థ’

సుభాష్‌నగర్: వినియోగదారులకు హెచ్‌టీ 11 కేవీ, 33 కేవీ, ఆపై ఓల్టేజీ సర్వీసుల మంజూరు వేగవంతానికి సింగిల్ విండో వ్యవస్థను ప్రవేశపెట్టామని ఎన్పీడీసీఎల్ నిజామాబాద్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఎస్ఈ) ఆర్ రవీందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వీసుల మంజూరును మరింత సరళీకృతం చేసేందుకు హెచ్‌టీ మానిటర్ సెల్‌ను సర్కిల్ కార్యాలయం, కార్పొరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేశామన్నారు. 11 కేవీ ఓల్టేజీ దరఖాస్తులను ఏడీఈ కమర్షియల్ అధికారి, 33 కేవీ ఓల్టేజీ, ఆపై ఓల్టేజీ దరఖాస్తులను ఏడీఈ కమర్షియల్ కార్పొరేట్ ఆఫీస్ అధికారి మానిటర్ చేస్తారని తెలిపారు. వినియోగదారుడు టీజీఎన్పీడీసీఎల్ పోర్టల్‌లో అవసరమైన పత్రాలతో హెచ్‌టీ దరఖాస్తులు నమోదు చేసుకున్న తర్వాత సంబంధిత అధికారులకు ఎస్టిమేట్ల కోసం పంపిస్తామన్నారు. ఫీల్డ్ స్టాఫ్ ఫిజిబిలిటీ, అవసరమైన మౌలిక సదుపాయాల కోసం లొకేషన్‌ను సందర్శిస్తారని తెలిపారు. 33 కేవీ, ఆపై ఓల్టేజీ ఎస్టిమేట్లను కార్పొరేట్ ఆఫీస్ అధికారులు అనుమతిస్తారన్నారు. దరఖాస్తులను పరిశీలించి ఫిజిబిలిటీ ఉంటే రెండు రోజుల్లో అప్‌లోడ్ చేస్తామని, వివిధ కారణాలతో సాధ్యపడకపోతే 2 రోజుల్లో రిమార్కులను వినియోగదారునికి మెసేజ్ రూపంలో పంపిస్తామని తెలిపారు. సింగిల్ విండో వ్యవస్థతో త్వరితగతిన సర్వీసులు మంజూరవుతాయని, ప్రతిసారి ఆఫీసులకు రాకుండా ట్రాక్ చేసుకునే సౌకర్యం ఉంటుందన్నారు. వినియోగదారులు దరఖాస్తుల స్థితిగతులను ఎప్పటికప్పుడు మెసేజ్ రూపంలో సమాచారం పంపిస్తామని ఎస్ఈ రవీందర్ తెలిపారు.

వాటర్ ట్యాంక్ ఎక్కిన భార్యాభర్తలు

- ఆత్మహత్యకు యత్నం.. కాపాడిన పోలీసులు



రామారెడ్డి: కుటుంబంలో నెలకొన్న సమస్యలతో భార్యాభర్తలిద్దరూ వాటర్ ట్యాంక్ ఎక్కి ఆత్మహత్యకు యత్నించిన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా.. రామారెడ్డి గ్రామానికి చెందిన దంపతులు అరుణ, శంకర్ గురువారం రామారెడ్డిలోని పెద్దమ్మ దుబ్బ మిషన్ భగీరథ ట్యాంక్ పైకెక్కి ఆత్మహత్య చేసుకుంటామని బెదిరించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, గ్రామస్తులు భార్యాభర్తలను సముదాయించి కిందకి దించారు. పోలీసులు వారికి కౌన్సెలింగ్ ఇచ్చి సమస్యలుంటే పరిష్కరించుకోవాలని, ఏదైనా సమస్య ఉంటే పోలీసులను సంప్రదించాలని సూచించారు. కుటుంబంలో నెలకొన్న సమస్యలతోనే వారు ట్యాంకు ఎక్కినట్లు సమాచారం.

కుక్కల దాడిలో బాలుడికి గాయాలు



బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రం ఎల్లమ్మ కుచ్చలో గురువారం ఇంటి ముందు ఆడుకుంటున్న బాలుడు రాంచదర్‌పై కుక్కలు దాడిచేసి గాయపరిచాయి. మూడు కుక్కలు ఒకేసారి వెంటపడి దాడి చేయగా ముఖానికి, చేతికి గాయాలు అయ్యాయి. బాలుడిపై కుక్కలు దాడిచేయడంతో కేకలు వేయగా తల్లిదండ్రులు బయటకు వచ్చి కుక్కలను తరిమి కొట్టడంతో ప్రమాదం తప్పింది. వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. అధికారులు స్పందించి కుక్కల నియంత్రణ కోసం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

క్రైం కార్నర్

బావిలో ఈత నేర్చుకోడానికి వెళ్లి బాలుడి మృతి



వర్ని: బావిలో ఈత నేర్చుకోవడానికి వెళ్లిన ఓ బాలుడు ప్రమాదవశాత్తు నీట మునిగి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. వర్ని మండలం సిద్ధాపూర్ గ్రామానికి చెందిన తాన్ సింగ్ (13) గురువారం గ్రామ శివారులో ఉన్న బావిలో ఈత నేర్చుకోవడానికి మరో ఇద్దరు స్నేహితులతో కలిసి వెళ్లాడు. బావిలోకి దిగి ఈత నేర్చుకుంటుండగా నీళ్లు ఎక్కువగా ఉండటంతో ప్రమాదవశాత్తు నీటా మునిగి మృతి చెందాడు. మృతుడి తండ్రి రాంచందర్ ఫిర్యాదు మేరకు వర్ని పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నీటిగుంతలో పడి గొర్లకాపరి..

ఇందల్వాయి: మండలంలోని డొంకల్ గ్రామంలో ఓ గొర్ల కాపరి నీటిగుంతలో పడి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. డొంకల్ గ్రామానికి చెందిన గొల్ల చిన్న సాయిలు(57) అనే గొర్ల కాపరి బుధవారం ఉదయం ఎప్పటిలాగానే గొర్లను మేపడానికి గ్రామ శివారుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు నీటి గుంతలో పడి మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు గురువారం మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి భార్య నర్సవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి..



వేల్పూర్: మండలంలోని అంక్సాపూర్ గ్రామం వద్ద గల 63నంబర్ జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందినట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు. రహదారిపై బైకు, టాటా ఏస్ వాహనం ఢీకొనడంతో బైక్ నడుపుతున్న గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. టాటా ఏస్ వాహనం డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం అతడిని ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

డిచ్‌పల్లి: మండలంలోని తెలంగాణ యూనివర్సిటీ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై ఎండీ షరీఫ్ తెలిపారు. గురువారం ఉదయం మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పంచాయతీ కార్యదర్శి జయశ్రీకి సమాచారం అందజేశారు. వెంటనే ఆమె డిచ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతదేహంపై నలుపురంగు ప్యాంట్ ఉందన్నారు. మృతుడి వయస్సు సుమారు 55 నుంచి 60 ఏళ్లలోపు ఉంటుందన్నారు. మృతుడిని ఎవరైనా గుర్తిస్తే డిచ్‌పల్లి పోలీసులకు గాని, 8712659851, 8712659852కు సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ఎడపల్లి(బోధన్): మండల కేంద్రంలోని తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఎడపల్లిలోని అందాపూర్ నర్సింలు ఇంటికి తాళం వేసి, రెండు రోజుల క్రితం కుటుంబంతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లారు. గురువారం తెల్లవారుజామున దుండగులు ఇంటి తాళం పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఉదయం పనిమనిషి ఇంటికి వచ్చి చూడగా, చోరీని గుర్తించి, యజమానికి సమాచారం అందించారు. కుటుంబీకులు ఎడపల్లికి పోలీసులకు ఫిర్యాదు చేయగా రూరల్ సీఐ విజయ్ బాబు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

ధాన్యం లారీ బోల్తా: డ్రైవర్‌కు గాయాలు



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని గోపాల్‌పేటలోగల కోదండ రామాలయం వద్ద గురువారం సాయంత్రం ధాన్యం లోడ్‌తో వెళ్తున్న లారీ బోల్తాపడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ జాఫర్‌కు గాయాలయ్యాయి. లారీ ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి మెయిన్‌రోడ్డుపైకి వచ్చే క్రమంలో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో గాయపడిన డ్రైవర్‌ను స్థానికులు చికిత్స నిమిత్తం గోపాల్‌పేటలోని ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. లారీలోని ధాన్యం బస్తాలు తడిచిపోకుండా లాపర్లను కప్పారు.

సాంబార్‌లో పడి బాలుడికి..



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన రెండేళ్ల బాలుడు మధుర సాత్విక్ ప్రమాదవశాత్తు సాంబార్‌లో పడి తీవ్రంగా గాయపడినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. గాంధారి మండలం గౌరారం తండాలో గురువారం జరిగిన వివాహ వేడుకకు సాత్విక్ తల్లిదండ్రులు రాజ్‌కుమార్, లలితలతో కలిసి వెళ్లాడు. సాయంత్రం సాత్విక్ ఆడుకుంటూ సాంబార్‌లో పడిపోయాడు. వెంటనే స్థానికులు గుర్తించి బాలుడిని చికిత్స నిమిత్తం నిజామాబాద్‌లోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు.

స్తంభం పైనుంచి పడి యువకుడికి..

మోపాల్: మండలంలోని నర్సింగ్‌పల్లిలో విద్యుత్ మరమ్మతులు చేపడుతుండగా ఓ యువకుడు స్తంభం పైనుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా.. నర్సింగ్‌పల్లిలో ఇటీవల కురిసిన వర్షాలకు విద్యుత్ స్తంభాలు నేల కొరగగా, కొత్త వాటిని ఏర్పాటు చేసేందుకు మతిన్ అనే కాంట్రాక్టర్‌కు అధికారులు పనులు అప్పగించారు. కాంట్రాక్టర్ వద్ద పని చేసేందుకు కందకుర్తి నుంచి ముషీర్ అనే యువకుడు వచ్చాడు. పనులు చేస్తున్న క్రమంలో ముషీర్ స్తంభం పైనుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే అతడిని నగరంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ విషయమై ఏఈ నాగశర్వాణిని 'సాక్షి' వివరణ కోరగా, ప్రమాదం జరిగిన మాట వాస్తవమేనని, క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించామని తెలిపారు.

డ్రంకన్‌డ్రైవ్ కేసులో పలువురికి జైలు

రుద్రూర్: మండలకేంద్రంలోని బస్టాండ్ వద్ద ఇటీవల పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టగా, సులేమాన్ నగర్‌కు చెందిన ఓ వ్యక్తి మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. పోలీసులు అతడిని గురువారం బోధన్ సెకండ్‌ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పర్చగా జడ్జి అతడికి ఒకరోజు జైలు శిక్ష , రూ. 2వేలు జరిమానా విధించినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. ఖలీల్‌వాడి: నగరంలో ఇటీవల ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టగా, మద్యం తాగి వాహనాలు నడుపుతూ 14మంది పట్టుబడ్డారు. వారికి గురువారం నగరంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పర్చగా జడ్జి 11 మందికి రూ.20,500 జరిమానా, ముగ్గురికి రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు ట్రాఫిక్ సీఐ ప్రసాద్ తెలిపారు. అలాగే నగరంలోని సాయిరెడ్డి పెట్రోల్ బంక్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టగా మాక్లూర్ మండలంలోని దుర్గానగర్ తండాకు చెందిన బంటు చిన్న మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. గురువారం అతడిని కోర్టులో హాజరు పర్చగా జడ్జి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు.


మట్కా ఆడుతున్న ఇద్దరికి..

ఖలీల్‌వాడి: నగరంలోని కొజ్జా కాలనీలో మట్కా ఆడుతున్న ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి గురువారం తెలిపారు. కొజ్జాకాలనీకి చెందిన సయ్యద్ అబ్దుల్ అస్మద్, అబ్దుల్ రహమాన్‌లు ఈనెల 8న సాయంత్రం మట్కా ఆడుతుండగా పోలీసులు పట్టుకున్నారు. వారిని కోర్టులో హాజరుపర్చగా జడ్జి ఇరువురికి రెండు రోజుల జైలు శిక్ష, రూ.500 చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు.

హోటల్ నిర్వాహకుడికి..

ఖలీల్‌వాడి: నగరంలోని తిలక్‌గార్డెన్ వద్ద ఉన్న గ్లామర్ హోటల్‌ను సమయపాలన పాటించకుండ తెరిచి ఉంచడంతో నిర్వాహకుడు ఎండీ అర్షదుద్దీన్‌ను పట్టుకున్నట్లు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. గురువారం అతడిని కోర్టులో హాజరుపర్చగా జడ్జి ఒకరోజు జైలు శిక్ష విధించారన్నారు.

ఆవులను ఎత్తుకెళ్లే ముఠా అరెస్టు



పోలీసుల అదుపులో ఉన్న ముఠాసభ్యులు

ఖలీల్‌వాడి: ఆవులకు మత్తు మందు ఇంజక్షన్లు ఇచ్చి కారుల్లో ఎత్తుకెళ్లే ముఠాను పట్టుకున్నట్లు సీసీఎస్ సీఐ సురేష్ గురువారం తెలిపారు. మహారాష్ట్రలోని నాందేడ్, ముంబాయికి చెందిన ఆరుగురు ముఠా సభ్యులు సయ్యద్ ఉమర్, సయ్యద్ ఆమీర్, అబ్దుల్ కలామ్, సయ్యద్ సోయాబ్, సమీర్‌ఆలీ, మహబూబ్‌అలీలు కార్లపై ప్రెస్, పోలీస్ బోర్డులు పెట్టుకుని దొంగ నెంబర్ ప్లేట్లతో నడుపుతూ ఆవులను ఇన్నోవా వెహికల్, ఇతర వాహనాలలో దొంగతనంగా తరలించేవారన్నారు. కార్లలో సీట్లు తీసివేసి ఆవులకు మత్తు ఇంజక్షన్లు ఇచ్చి, ఎక్కించేవారన్నారు. నాందేడ్‌కు ప్రత్యేక బృందంతో వెళ్లి, రెండు రోజులు గాలించి ముఠా సభ్యులు పట్టుకున్నట్లు తెలిపారు. ముఠా సభ్యులపై చర్యలు తీసుకునేందుకు మహారాష్ట్రలోని దెగ్లూర్ పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. సీసీఎస్ సిబ్బంది యాదగిరి, సుభాష్, నీలేష్, నరేష్ ఉన్నారు.

బాలిక అదృశ్యం

వర్ని: మండలంలోని జాకోర గ్రామానికి చెందిన ఎర్రోళ్ల ప్రవళిక (14) అదృశ్యమైనట్లు పోలీసులు గురువారం తెలిపారు. వారం రోజుల నుండి బాలిక కనబడటం లేదని తల్లి అనిత గురువారం వర్ని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని, గాలింపు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

దాడి కేసులో ఒకరి రిమాండ్

ఖలీల్‌వాడి: నగరంలోని హబీబ్ నగర్‌లో ఇటీవల ఒకరిపై కత్తితో దాడి చేసి గాయపర్చిన కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి గురువారం తెలిపారు. హబీబ్‌నగర్‌లోని షేక్ షహబాత్ (24)పై ధర్మపురిహిల్స్‌కు చెందిన షేక్ హర్షద్ (20) దాడి చేయగా అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.